News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :221 | ఖమ్మం | ఆదివారం సెప్టెంబర్ 21, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు



- 2023 సంవత్సరానికి గాను మోహన్‌లాల్‌కు విశిష్ట పురస్కారం
- భారతీయ సినిమాకు చేసిన సేవలకు దక్కిన గొప్ప గౌరవం
- సెప్టెంబర్ 23న జరగనున్న జాతీయ అవార్డుల వేడుకలో ప్రదానం
- లాల్‌ను ప్రత్యేకంగా అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ
- నాలుగు దశాబ్దాల కెరీర్‌లో 400కు పైగా చిత్రాల్లో నటించిన లెజెండ్
- గతంలో పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్న నటుడు

వివరాలు 2లో..



# ఎయిర్ పోర్టులపై సైబర్ అటాక్!

### హెచ్ 1 బీ వీసాల ప్రకటన వేళ గందరగోళం

- ఒక్కసారిగా ఫుల్ బిజీగా మారిన విమానాశ్రయాలు
- అదును చూసి రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు
- ఆలస్యంగా నడుస్తున్న వందలాది విమానాలు
- ప్రయాణాలు రద్దు చేసుకున్న వేల మంది

వివరాలు 2లో..

యూరప్‌లోని పలు కీలక విమానాశ్రయాలపై జరిగిన భారీ సైబర్ దాడితో విమానయాన సేవలు అస్తవ్యస్తంగా మారాయి. లండన్ హీత్రో, బ్రసెల్స్, బెర్లిన్ వంటి ప్రధాన విమానాశ్రయాలు ఈ దాడి ప్రభావానికి గురవడంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కీలకమైన ఆన్‌లైన్ వ్యవస్థలు కుప్పకూలడంతో అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, మరికొన్నింటిని రద్దు చేశారు. సైబర్ నేరగాళ్లు విమానాశ్రయాల సర్వీస్ ప్రొవైడర్లను లక్ష్యంగా చేసుకోవడంతో

## మహిళలకు రూ.41.51కోట్ల రుణాలు

- త్వరలో మరిన్ని మహిళా సంఘాలకు అవకాశం
- కోటి మంది మహిళలనుకోటీశ్వరులను చేస్తం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మహిళలకు ఉచిత ప్రయాణాన్ని బీఆర్ఎస్ అవహేళన చేస్తోంది : మంత్రి సీతక్క



హైదరాబాద్ లో గత పదేళ్ల నుంచి వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఇందిరమ్మ రాజ్యం వచ్చాక తిరిగి మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని చెప్పారు. జూబ్లీహిల్స్ లో మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులు పంపిణీ చేసిన ఆయన.. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే ప్రణాళికతో ముందుకెళు_తున్నామని చెప్పారు. సంవత్సరానికి 20 వేల కోట్ల రూపాయలు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తామంటే అందరూ నవ్వారు.. మొదటి సంవత్సరంలోనే 21 వేల కోట్లు ఇచ్చామని తెలిపారు భట్టి విక్రమార్క. ' హైదరాబాద్ లో 50,764 గ్రూపులున్నాయి, ఐదు లక్షలకు పైగా సభ్యులున్నారు. త్వరలో మరిన్ని మహిళా గ్రూపులు పెంచి, వారందరికీ రుణాలు అందిస్తాం. ఈ రోజు 41 కోట్ల 51 లక్షల వడ్డీ లేని రుణాలు మహిళలకు అందిస్తున్నాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 8 వేల మంది మహిళలు

వివరాలు 2లో..

## నేను మళ్లీ చెబుతున్నా, మనకు ఒక బలహీన ప్రధాని ఉన్నారు



- అమెరికాలో భారీగా పెరిగిన హెచ్-1బీ వీసా ఫీజులు
- ప్రధాని మోదీ బలహీన ప్రధాని అంటూ రాహుల్ తీవ్ర విమర్శ
- లక్ష డాలర్లకు చేరిన వార్షిక ఫీజుతో భారతీయులపై పెను భారం
- మోదీ-ట్రంప్ స్నేహం వట్టిదేనని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు
- అమెరికన్ల ఉద్యోగాల కోసమే ఈ నిర్ణయమన్న ట్రంప్ ప్రభుత్వం

వివరాలు 2లో..




# హెచ్-1బీ పిడుగు


- వార్షిక వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన నిర్ణయం
- భారత ఐటీ ఉద్యోగులపై పెను ప్రభావం
- టెక్ కంపెనీల్లో కలవరం
- తక్షణం యూఎస్‌కు వచ్చేయాలంటూ ఉద్యోగులకు ఈ మెయిళ్లు
- దీంతో విమానాశ్రయాల్లో రద్దీ
- భారీగా పెరిగిన విమాన టికెట్ రేట్లు
- ఈ నిర్ణయం కొత్త వీసాదారులకు మాత్రమే
- వివరణ ఇచ్చిన వైట్‌హౌస్
- ఈ గందరగోళాన్ని అమెరికా పరిష్కరిస్తుందని భావిస్తున్నాం: భారత్

అత్యుత్తమ నైపుణ్యాలున్న వ్యక్తులను అమెరికాకు రప్పించేందుకు హెచ్-1బీ వీసా పథకం తెచ్చాం. ఇది దుర్వినియోగం అవుతోంది. తక్కువ వేతనాలు, తక్కువ నైపుణ్యం ఉన్న వారు అమెరికాకు వస్తున్నారు. వీసా మోసాలకు, మనీలాండరింగ్ లాంటి కార్యకలాపాలకూ ఈ పథకం వేదికవుతోంది.

ట్రంప్

వివరాలు 2లో..





## విదేశాలపై ఆధారపడటమే అతిపెద్ద శత్రువు

- హెచ్1బీ వీసా ఫీజు పెంపు... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- పరాధీనతే మన నిజమైన శత్రువు అన్న ప్రధాని మోదీ
- ఆత్మనిర్భర్ భారత్‌తోనే ప్రపంచంలో గౌరవం అని స్పష్టం
- విదేశీ షిప్పింగ్‌పై ఏటా రూ.6 లక్షల కోట్ల భారీ వ్యయం
- మన రక్షణ బడ్జెట్‌కు సమానమైన మొత్తమని వెల్లడి
- కాంగ్రెస్ విధానాలతోనే షిప్పింగ్ రంగం కుప్పకూలిందని విమర్శ

## తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు

- ప్రకృతిని ఆరాధించే గొప్ప వేడుకగా అభివర్ణన
- రాష్ట్ర ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అని వెల్లడి
- తొమ్మిది రోజుల పాటు వేడుకలు వైభవంగా జరపాలని ఆకాంక్ష



తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు, మహిళల ఔన్నత్యానికి ప్రతీక అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, కష్టసుఖాలను కలిసి పంచుకునే వారి సామూహిక జీవన

వివరాలు 2లో..

## ప్రజల జేబులు కొట్టడానికే 'రోడ్ సేఫ్టీ సెస్'

- కొత్త వాహనాలపై రోడ్ సేఫ్టీ సెస్ విధింపుపై కేటీఆర్ ఆగ్రహం
- ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు ఇవ్వకుండా ప్రజలపై భారం మోపడం ఏంటని ఫైర్
- వాహనాన్ని బట్టి రూ. 2 వేల నుంచి రూ. 10 వేల వరకు అదనపు వసూలు
- గ్యారెంటీలను గాలికొదిలేసి పన్నులు వేస్తున్నారని తీవ్ర విమర్శ
- ఇది పేద, మధ్యతరగతిని దగా చేయడమేనన్న మాజీ మంత్రి

వివరాలు 2లో..




## తొక్కుకుంటూ వెళ్లాల్సిందే

- రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరన్న జాగృతి అధ్యక్షురాలు
- కాంగ్రెస్ లోకి వెళ్లే ఆలోచన తనకు లేదని స్పష్టత
- చింతమడకలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటానని వెల్లడి

వివరాలు 2లో..






## స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న తెలంగాణ సర్కార్
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయం

వివరాలు 2లో..

# హెచ్-1బీ పిడుగు

## ఉత్తర్వులో ఏముందంటే...

**అమెరికాలోకి ప్రవేశించే హెచ్1-బీ వీసాదార్ల పిటిషన్లను నియంత్రిస్తున్నాం.**
**నిబంధనలకు లోబడి లక్ష డాలర్లు చెల్లించిన వారి పిటిషన్లను అనుమతిస్తాం.**
**ఈ నిబంధనలు అమెరికా కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక 12.01 గంటల నుంచి ఏడాది పాటు అమల్లో ఉంటాయి.**
**ప్రస్తుతం అమెరికా బయట ఉన్నవారు లక్ష డాలర్లు చెల్లించకపోతే వారి హెచ్-1బీ పిటిషన్లను 12 నెలల వరకు పరిశీలించం.**

అమెరికాలో ఉద్యోగం చేద్దామని కలలు కంటున్న భారతీయులు సహా ప్రపంచంలోని వివిధ దేశాల వారికి పిడుగులాంటి వార్త. హెచ్-1బీ వీసాల వార్షిక దరఖాస్తు రుసుమును లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు)కు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ భారీ పెంపునకు సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వులపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంతకాలు చేశారు. భారత్‌లో, అందునా తెలుగు రాష్ట్రాలను తీవ్రంగా ప్రభావితం చేసే ఈ నిర్ణయం ఈ నెల 21 నుంచి ఒక ఏడాది పాటు అమల్లో ఉండనుంది. ఇది భారత్‌నే కాదు.. చైనా సహా పలు దేశాలనూ ప్రభావితం చేయనుంది. వార్షిక ఫీజు పెంపుతో ఉద్యోగులతో పాటు టెక్ కంపెనీలూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ వీసాదారులు తక్షణమే అమెరికాకు తిరిగి రావాలని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు సూచనలు జారీచేస్తున్నారు.

భారత కాలమానం ప్రకారం వీరంతా ఆదివారం ఉదయం 9.30 గంటలకల్లా అమెరికా చేరుకోవాలని, లేకపోతే.. పెంచిన హెచ్-1బీ వార్షిక ఫీజు ప్రకారం రూ.88 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వార్తలు రావడంతో అగ్రరాజ్యానికి వెళ్లే విమానాల కోసం హెచ్-1బీ వీసాదారులు భారీస్థాయిలో విమానాశ్రయాలకు చేరుకుంటున్నారు. మరోవైపు అమెరికాలో అలజడి రేగుతోంది. పండుగలకు భారత్ వెళ్లాలనుకొనే వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. విమానాలు ఎక్కిన వారు కూడా దిగిపోతున్నారు. లక్ష డాలర్ల ఫీజు పెంపుపై అయోమయం నెలకొనడంతో వైట్‌హౌస్ వివరణ ఇచ్చింది. కేవలం కొత్త వీసాదార్లకు మాత్రమే ఈ ఫీజు వర్తిస్తుందని తెలిపింది. "నైపుణ్యమున్న అంతర్జాతీయ ఉద్యోగులను తీసుకొనే సంస్థలు ఏటా ప్రతి ఉద్యోగికి ఈ వీసా ఫీజు కింద ఆరు సంవత్సరాల వరకు లక్ష డాలర్లు చెల్లించాలి. ఈ ఫీజు కొత్త దరఖాస్తుదారులకు మాత్రమే వర్తిస్తుంది" అని వైట్‌హౌస్ ప్రతినిధి తెలిపారు.

**అందుకే ఈ నిర్ణయం: ట్రంప్**

హెచ్-1బీ వీసా పథకం తీవ్రంగా దుర్వినియోగం అవుతోందని ఫీజు పెంపు ఉత్తర్వులపై సంతకం చేస్తూ ట్రంప్ పేర్కొన్నారు. దేశ భద్రతకే ముప్పుగా పరిణమించిందని అన్నారు. హెచ్-1బీ వీసాల మాటున కొన్ని సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయని తెలిపారు. అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తులే తమ దేశానికి రావాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. ఈ చర్యను టెక్ పరిశ్రమ వ్యతిరేకించబోదని చెప్పారు.

**సింహభాగం భారతీయులే**

1990లో అత్యంత నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణుల కోసం హెచ్-1బీ వీసాను తీసుకొచ్చారు. యూఎస్‌లోని టెక్నాలజీ కంపెనీలు విదేశీ నిపుణుల కోసం ఇవి జారీ చేస్తాయి. హెచ్-1బీ వీసాదారుల్లో

ఇండియాకు 71 శాతం వాటా, చైనాకు 11.7 శాతం వాటా ఉంది. ఈ ఫీజు పెంపు నేరుగా మన ఐటీ ప్రొఫెషనల్స్‌పై ప్రభావం చూపనుంది. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ వంటి కంపెనీలు ప్రతి సంవత్సరం వేలాది ఉద్యోగులను అమెరికాకు పంపుతున్నా యి. ఇప్పుడు ఒక్కో ఉద్యోగి కోసం దాదాపు రూ.88 లక్షలు ఖర్చు చేయడం ఆర్థికపరంగా భారంగా మారనుంది.

**తక్షణం తిరిగి వచ్చేయండి**

అమెరికా బయట ఉన్న హెచ్-1బీ వీసాదారులు ఆదివారం ఉదయం 9.30 గంటల్లోపు అగ్రరాజ్యానికి చేరుకోవాలని, లేకపోతే లక్ష డాలర్లు (రూ.88 లక్షలు) చెల్లించాల్సి ఉంటుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ వీసాదారులు తక్షణమే అమెరికాకు చేరుకోవాలని మైక్రోసాఫ్ట్, మెటా వంటి టెక్ సంస్థలు తమ ఉద్యోగులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. ఇతర దేశాల్లో ఉన్న హెచ్-1బీ, హెచ్-4 వీసాదారులు ఈ నెల 21 లోపు అమెరికాకు తిరిగిరావాలని కోరుతూ మైక్రోసాఫ్ట్ కూడా తమ ఉద్యోగులకు అడ్వైజరీ జారీ చేసినట్లు తెలుస్తోంది. అమెరికాలోనే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు మంచి భవిష్యత్తు కోసం అక్కడే పనిని కొనసాగించాలని మైక్రోసాఫ్ట్ సూచించినట్లు తెలుస్తోంది. మరో దిగ్గజ సంస్థ మెటా కూడా తమ ఉద్యోగులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పని లేదా సెలవుల కోసం ఇతర దేశాలకు వెళ్లిన హెచ్-1బీ వీసా కలిగి ఉన్న తమ ఉద్యోగులు 24 గంటల్లోగా అమెరికాకు తిరిగి వచ్చేయాలని ఆదేశాలు ఇచ్చింది. అమెరికాలో ఉంటున్న హెచ్-1బీ, హెచ్-4 ఉద్యోగులు రెండు వారాలు పాటు ఇతర దేశాలకు వెళ్లొద్దని సూచించింది.

**ధనవంతులకు 'గోల్డ్ కార్డ్'**

హెచ్-1బీ వీసాదారులకు వార్షిక ఫీజు భారీగా పెంచిన ట్రంప్.. ధనవంతులైన విదేశీయుల కోసం 'గోల్డ్ కార్డ్' పథకం తెచ్చారు. ఇందులో చేరాలనుకొనే వ్యక్తులు 1 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.81 కోట్లు) అమెరికా ట్రెజరీకి బహుమతిగా చెల్లించాలి. వారినేదైనా కార్పొరేషన్ స్పాన్సర్ చేస్తే రెండు మిలియన్ డాలర్లు (సుమారు 17.62 కోట్లు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద నమోదైన వారికి గ్రీన్‌కార్డ్ కూడా లభ్యం కానుంది. "మేం ఈ పథకం ద్వారా వందలాది బిలియన్ డాలర్లు తీసుకుంటున్నాం. ఈ డబ్బుతో పన్నులు తగ్గిస్తాం, అప్పునూ తగ్గించుకుంటాం" అని ట్రంప్ చెప్పారు.

**అమెరికాలో విదేశీ ఉద్యోగుల శకం ముగిసింది**
**- అమెరికా వాణిజ్యశాఖ మంత్రి**

హెచ్-1బీ వీసాల వార్షిక రుసుమును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా పెంచడంపై ఆ దేశ వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. కష్టపడి పనిచేసే అమెరికన్ల నుంచి విదేశీ వ్యక్తులు ఉద్యోగాలు లాక్కొనే పద్ధతికి కొత్త వీసా నిబంధనలు ముగింపు పలుకుతాయని వ్యాఖ్యానించారు. తద్వారా అమెరికాకు గణనీయమైన ప్రయోజనం లభిస్తుందని అన్నారు. "కష్టపడి పనిచేసే అమెరికన్ల నుంచి ఉద్యోగాలను లాక్కొంటున్న పద్ధతికి ముగింపు పలుకుతాం. ఆర్థిక వ్యవస్థను ఉపయోగించుకొని ప్రతిఫలంగా ఏమీ అందించకుండా పని చేసే కార్మికులను తగ్గిస్తాం. అది దేశానికి గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుంది" అని తెలిపారు.

**మోయలేని భారం**

హెచ్-1బీ వార్షిక ఫీజు పెంపు భారం మోయలేనంతగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికాలో ఒక మధ్యస్థాయి ఇంజినీర్ సంవత్సరానికి 1,20,000 డాలర్లు సంపాదిస్తే.. అందులో లక్ష డాలర్లు వీసా ఫీజు అంటే.. 80 శాతం జీతం అక్కడే పోతుంది. దీనివల్ల అత్యధిక స్థాయిలో వేతనం పొందేవారు మినహా మిగిలినవారు యూఎస్ వలస వెళ్లడం పెనుభారమే అవుతుంది.

అమెరికాలో మాస్టర్స్, పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత హెచ్-1బీ వీసాలకు మారే కమ్యూనిటీలో కూడా భారతీయులదే ఆధిపత్యం. ఇప్పుడు ఈ పిడుగు లాంటి వార్త వారి కెరీర్ అవకాశాలకు భారీగా గండి కొట్టనుంది.

# విదేశాలపై ఆధారపడటమే అతిపెద్ద శత్రువు

భారతదేశానికి అసలైన శత్రువు ఇతర దేశాలపై ఆధారపడటమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ బలోపేతానికి, ప్రపంచ గౌరవానికి స్వావలంబన ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. హెచ్1బీ వీసా ఫీజు పెంపు వేళ, గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో శనివారం జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచంలో మనకు పెద్ద శత్రువులెవరూ లేరు. ఇతర దేశాలపై ఆధారపడటమే మన ఏకైక నిజమైన శత్రువు. ఈ పరాధీనత అనే శత్రువును మనమందరం కలిసి ఓడించాలి" అని మోదీ పిలుపునిచ్చారు. ఇతరులపై ఆధారపడితే మన ఆత్మగౌరవం దెబ్బతింటుందని, 140 కోట్ల మంది ప్రజల భవిష్యత్తును ఇతరుల చేతుల్లో పెట్టలేమని ఆయన అన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం తప్పనిసరిగా ఆత్మనిర్భర్‌గా మారాలని ఆయన అభిప్రాయపడ్డారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో నౌకా నిర్మాణాన్ని ప్రోత్సహించకుండా, విదేశీ నౌకలకు అద్దె చెల్లించడానికే వారు ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. దీనివల్ల దేశంలో షిప్పింగ్ రంగం పూర్తిగా కుప్పకూలిందని, 90 శాతం వాణిజ్యం కోసం విదేశీ నౌకలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు."ప్రపంచవ్యాప్తంగా సరుకు రవాణా కోసం విదేశీ షిప్పింగ్ సంస్థలకు భారత్ ఏటా దాదాపు రూ.6 లక్షల కోట్లు చెల్లిస్తోంది. ఈ మొత్తం మన రక్షణ బడ్జెట్‌తో దాదాపు సమానం" అని మోదీ వివరించారు. అమెరికా ఇటీవల హెచ్-1బీ వీసాలపై భారీగా ఫీజులు విధించడం, భారత దిగుమతులపై సుంకాలు కొనసాగించడం వంటి పరిణామాల నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన దిగ్గజ నటుడు, సూపర్ స్టార్ మోహన్‌లాల్‌ను భారత సినీ రంగంలో అత్యంత విశిష్ట దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం వరించింది. భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలకు గుర్తింపుగా, 2023 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. "మోహన్‌లాల్ అద్భుతమైన సినీ ప్రయాణం ఎన్నో తరాలకు స్ఫూర్తిదాయకం. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలు అజరామరం. తన అసమాన ప్రతిభ, వైవిధ్యంతో భారత సినీ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయాన్ని నెలకొల్పారు" అని తమ పోస్ట్‌లో పేర్కొంది.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మోహన్‌లాల్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "మోహన్‌లాల్ ప్రతిభకు, వైవిధ్యానికి నిలువుటద్దం. దశాబ్దాలుగా మలయాళ సినిమాకు ఆయన వెలుగు దివిటీలా నిలిచారు. కేవలం మలయాళంలోనే కాకుండా తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఆయన ప్రదర్శించిన నటన అద్భుతం" అని ప్రధాని కొనియాడారు. ఆయన విజయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ఆకాంక్షించారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో మోహన్‌లాల్ 400కు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. గతంలో ఆయనను భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ, 2019లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది.

సెప్టెంబర్ 23న జరగనున్న 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో మోహన్‌లాల్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. కాగా, 2022 సంవత్సరానికి గాను ఈ అవార్డును ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తి అందుకున్న విషయం విదితమే.

# ప్రజల జేబులు కొట్టడానికే 'రోడ్ సేఫ్టీ సెస్'

- మొదటి పేజి తరువాయి

తెలంగాణలో కొత్తగా వాహనాలు కొనుగోలు చేసేవారిపై 'రోడ్ సేఫ్టీ సెస్' పేరుతో ప్రభుత్వం అదనపు భారం మోపడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇది పేద, మధ్యతరగతి ప్రజలను దగా చేయడమేనని ఆయన మండిపడ్డారు. రహదారి ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సింది పోయి, ఆ భారాన్ని ప్రజలపైకి నెట్టడం ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు.రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి రహదారుల భద్రతా ప్రమాణాలను పెంచాల్సిన బాధ్యతను విస్మరించి, అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూడటం దారుణమని కేటీఆర్ అన్నారు. కొత్తగా కొనే ప్రతి వాహనంపై రూ. 2 వేల నుంచి రూ. 10 వేల వరకు సెస్ వసూలు చేయాలన్న నిర్ణయం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.'హైడ్రా' వంటి తప్పుడు విధానాలతో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి, ఇప్పుడు ఆ లోటును పూడ్చుకోవడానికే ఇలాంటి పన్నులు వేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇచ్చిన గ్యారెంటీలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల నుంచి రూ. 270 కోట్లు ముక్కుపిండి వసూలు చేసేందుకు కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని, అప్పు చేసి వాహనాలు కొనే సామాన్యుల జేబులు కొట్టే ఇలాంటి చర్యలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు కాంగ్రెస్ సర్కారును క్షమించరని ఆయన హెచ్చరించారు.

# ఎయిర్ పోర్టులపై సైబర్ అటాక్!

- మొదటి పేజి తరువాయి

చెక్-ఇన్, బోర్డింగ్ వంటి ముఖ్యమైన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా, బ్రసెల్స్ విమానాశ్రయంలో ఆటోమేటెడ్ చెక్-ఇన్, బోర్డింగ్ సిస్టమ్‌లు పూర్తిగా పనిచేయడం లేదని అక్కడి అధికారులు తెలిపారు. దీంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు గంటల తరబడి విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సైబర్ దాడి కారణంగా విమానాల రాకపోకలు దాదాపుగా నిలిచిపోయాయని అంతర్జాతీయ మీడియా సంస్థలు నివేదించాయి. ప్రయాణికులు తమ విమాన సర్వీసుల తాజా సమాచారం కోసం సంబంధిత విమానయాన సంస్థల వెబ్‌సైట్లను పరిశీలించాలని అధికారులు సూచించారు. ఈ సమస్యపై విమానాశ్రయ అధికారులు స్పందిస్తూ, "మా సాంకేతిక బృందాలు సిస్టమ్‌లను పునరుద్ధరించేందుకు నిరంతరం పనిచేస్తున్నాయి. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం" అని హామీ ఇచ్చారు. ఇప్పటికే విమానాశ్రయాలకు చేరుకున్న ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా వారు వెల్లడించారు. ఈ సంఘటన యూరప్‌లోని విమానాశ్రయాల సైబర్ భద్రతలోని లోపాలను మరోసారి ఎత్తిచూపింది. ఇటీవల జపాన్ ఎయిర్‌లైన్స్‌పై కూడా ఇలాంటి దాడే జరిగినట్లు తెలుస్తోంది.

# నేను మళ్లీ చెబుతున్నా, మనకు ఒక బలహీన ప్రధాని ఉన్నారు

అమెరికా తీసుకున్న హెచ్-1బీ వీసా ఫీజు పెంపు ని ర్ణయం ఇప్పుడు భారత్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టి స్తోంది. ఈ పరిణామంపై

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నేను మళ్లీ చెబుతున్నా... భారత్‌కు ఒక బలహీన ప్రధాని ఉన్నారంటూ ఆయన ఘాటుగా విమర్శించారు.

శనివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్-1బీ వీసా ఫీజును 1,00,000 డాలర్లకు పెంచడం వల్ల అత్యధికంగా నష్టపోయేది భారతీయులేనని పేర్కొంటున్న ఒక వార్తా కథనాన్ని కూడా ఆయన తన పోస్టుకు జత చేశారు. 2017 జులై 5న కూడా తాను ఇదే విధంగా "భారత్‌కు బలహీన ప్రధాని ఉన్నారు" అని చేసిన పాత పోస్టును ఆయన గుర్తుచేశారు.అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల 71 శాతం హెచ్-1బీ వీసాలు కలిగి ఉన్న భారతీయులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడనుంది. గతంలో 1,700 నుంచి 4,500 డాలర్ల మధ్య ఉన్న ఈ ఫీజును అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగాన్ని అరికట్టి, దేశీయ అమెరికన్లకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా ప్రభుత్వం తన ప్రకటనలో స్పష్టం చేసింది.ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వ విధానాలను తప్పుబట్టింది. కాంగ్రెస్ ఎంపీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ, "ఒకవైపు ట్రంప్‌తో గొప్ప స్నేహం అంటారు, మరోవైపు భారతీయులపై ఇలాంటి భారం మోపుతున్నారు. ఆయన తనను తాను రాజులా భావిస్తున్నారు" అని విమర్శించారు. మరో కాంగ్రెస్ నేత సురేంద్ర రాజ్‌పుత్ మాట్లాడుతూ, "మోదీకి స్నేహితుడినని చెప్పుకుంటూనే అమెరికా శత్రువులా ప్రవర్తిస్తోంది. చాబహార్ పోర్టుపై ఆంక్షల నుంచి భారత వస్తువులపై 50 శాతం టారిఫ్‌ల వరకు అన్నీ మనకు వ్యతిరేకంగానే ఉన్నాయి" అని ఆరోపించారు.హెచ్-1బీ వీసా అనేది అమెరికా కంపెనీలు టెక్నాలజీ, ఇంజనీరింగ్ వంటి రంగాలలో నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను తాత్కాలికంగా నియమించుకోవడానికి అనుమతించే ఒక వర్క్ పర్మిట్. ఏటా 85,000 వీసాలను జారీ చేస్తుండగా, తాజా నిర్ణయం భారతీయ టెకీలపై, వారిని నియమించుకునే అమెరికన్ టెక్ కంపెనీలపై కూడా తీవ్ర ప్రభావం చూపనుంది.

## మహిళలకు రూ.41.51కోట్ల రుణాలు

- మొదటి పేజి తరువాయి

లబ్ది పొందబోతున్నారు. భర్తతో పాటు భార్య కూడా కుటుంబ పోషణ చూసుకుంటుంది. చిరు వ్యాపారాలు చేసుకునే వారి నుంచి బస్సులు ఇప్పించే వరకు వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తున్నాం. భవిష్యత్ లో మహిళలు బయట రుణాలు తీసుకోవాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఇచ్చే వడ్డీ లేని రుణాల వల్ల మహిళలు వ్యాపారస్తులుగా మారి ఆర్థికంగా నిలదొక్కుకుంటు న్నారు. శిల్పారామం లాంటి ప్రాంతాల్లో మహిళా గ్రూప్ సభ్యులు షాప్స్ నిర్వహి స్తున్నారు. ఆర్టీసీలో మహిళలు 150 బస్సులు పెట్టారు. త్వరలో వడ్డీ లేని రుణాలు ఇచ్చి మరో 450 బస్సులు ఆర్టీసీలో పెట్టేలా ప్లాన్ చేస్తుంది ప్రభుత్వం. పేదలందరికీ పది లక్షల వరకు ఏ కార్పొరేట్ హాస్పిటల్ కి అయినా వెళ్ళి వైద్యం పొందేలా ఆరోగ్యశ్రీ ను తీసు కొచ్చాం. రేషన్ కార్డు దారులందరికీ సన్న బియ్యం ఇస్తున్నాం. పది సంవత్సరాలుగా ఒక్క కొత్త రేషన్ కార్డు రాలేదు. మహిళలు ఆర్థికంగా బలంగా నిలబడితే కుటుంబం బాగుంటుంది. అర్హులైన ప్రతీ ఒక్కరికీ వడ్డీలేని రుణాలు అందిస్తాం'. అని భట్టి విక్రమార్క అన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రేవంత్ సర్కార్ సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న అందుబాటులో ఉన్న మంత్రులతో సమావేశమయ్యారు.సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన దాదాపు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

తెలంగాణ హైకోర్టు ఇటీవల సెప్టెంబర్ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను వేగంగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు

- మొదటి పేజి తరువాయి

విధానానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆడపడుచులందరూ ఈ పూల పండుగను సంతోషంగా, కలిసికట్టుగా జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగిసే ఈ తొమ్మిది రోజుల ఉత్సవాలను రాష్ట్ర ప్రజలందరూ ఆటపాటలతో ఘనంగా నిర్వహించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## తొక్కుకుంటూ వెళ్లాల్సిందే

రాజకీయాల్లో ఎవరూ ఎవరికీ చోటివ్వరని, తొక్కుకుంటూ ముందుకు వెళ్లాల్సిందేనని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు విషయమై ఇంకా ఆలోచించలేదని చెప్పారు. కాంగ్రెస్ లోకి వెళతారన్న ప్రచారాన్ని కవిత తిప్పికొట్టారు. తనకు ఆ ఆలోచనే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పెద్దలు ఎవరూ తనను సంప్రదించలేదని తేల్చిచెప్పారు.

హరీశ్ రావుతో విభేదాలపై స్పందిస్తూ.. కాళేశ్వరం అంశంలో తప్ప హరీశ్ రావుపై తనకెలాంటి కోపంలేదన్నారు. నీటిపారుదల శాఖలో ఫైళ్లు నేరుగా ముఖ్యమంత్రి వద్దకే వెళుతున్నాయని 2016లోనే తాను కేటీఆర్ కు సూచించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ, హరీశ్‌రావు, సంతోష్ సోషల్ మీడియాలు తనపై చేస్తున్న దాడిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కాగా, ఆదివారం చింతమడకలో జరిగే బతుకమ్మ వేడుకలకు తాను హాజరవుతానని కవిత తెలిపారు.

**ఆల్మట్టి విషయంలో సుప్రీంకు వెళతాం..**

ఆల్మట్టి ఆనకట్ట పెంపు విషయంలో కర్ణాటక ప్రభుత్వ తీరుపై కవిత మండిపడ్డారు. సుప్రీంకోర్టు స్టే విధించినా అక్కడి సర్కారు లెక్కచేయడంలేదని విమర్శించారు. కర్ణాటకను అడ్డుకోకుంటే కృష్ణా నదిలో నీటి చుక్క కూడా మిగలదని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆల్మట్టిపై వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. లేదంటే జాగృతి తరఫున తామే అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోకపోతే నిరసనలు తెలుపుతామని ప్రభుత్వాన్ని కవిత హెచ్చరించారు.

# ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో ఉన్న బీసీ బాలికల వసతి గృహ ప్రహరీ గోడకి వెంటనే ప్రభుత్వం గేటును ఏర్పాటు చేయాలి

**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్**
బీసీ బాలికల వసతి గృహ భవనాన్ని మరమ్మతులు చేయాలి
వేముల నాగరాజు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం రోజున ఆత్మకూర్ ఎం మండల కేంద్రంలో ఉన్న బాలికల వసతి గృహాన్ని సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ హాస్టల్లో ఉన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలన్నారు ప్రధానంగా హాస్టల్లో లోపలికి ఎవరు రాకుండా రక్షణగా ఉండేందుకు ప్రహరీ గోడకు గేటు నిర్మాణం చేపట్టాలన్నారు అదేవిధంగా హాస్టల్లో వాన వస్తే రాత్రంతా పిల్లలంతా నిద్రపోకుండా హాస్టల్ అంతా కురుస్తా ఉంటే గిన్నెలు పెట్టి కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది అన్నారు పేద పిల్లల హాస్టల్లో చదువుతూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశతో పేద తల్లిదండ్రులు హాస్టల్లో చేరుస్తే ప్రభుత్వం విద్యారంగం పట్ల పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నది తక్షణమే ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి పేరుకే ఆర్భాటంగా పాఠశాలల గురుకులాల సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి వైపు ప్రభుత్వం నడుస్తావున్నది మది ప్రజా ప్రభుత్వం అని పేరుకే చెప్తా ఉన్న పరిస్థితి ఉన్నది ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని కేటాయించి ఈ విద్యా వ్యవస్థను కింది నుండి పై ఉన్నత విద్య వరకు రివ్యూ నిర్వహించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు వెంటనే ఆత్మకూర్ ఎం బీసీ హాస్టల్ ను సందర్శించి అక్కడ విద్యార్థుల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలన్నారు అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని అన్ని గురుకులాలకు సంక్షేమ వసతి గృహాలకు మార్చి నెల నుండి ఇప్పటివరకు ఒక్క రూపాయి కాస్మోటిక్ బిల్లులు విడుదల కాలేదు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేయడం జరిగింది ఈ సమస్యలన్నీ పరిష్కారం చేయకపోతే ఎస్ఎఫ్ఐగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జ్యోతిబాస్, రాజు,నవ్య,కవిత తదితరులు పాల్గొన్నారు



# మునగ సాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వి సుబ్బారావు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),సెప్టెంబర్ 20,**
జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మరియు జిల్లా పర్యటనలో భాగంగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వి. సుబ్బారావు కలిసి అశ్వాపురం మరియు బూర్గంపహాడ్ మండలాల పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్గంపహాడ్ మండలంలోని ఇరవెండి గ్రామ పంచాయతీ పరిధిలో తాజరాణి లలిత కుమారి ఫిష్ ఫార్మింగ్ యూనిట్‌ను పరిశీలించి, లబ్ధిదారుల తో ప్రత్యక్షంగా చర్చించారు. యూనిట్ మొత్తం విలువ రూ. 5,00,000 గా, ఇందులో సబ్సిడీ రూ. 1,75,000, రుణం రూ. 3,00,000, వాటా ధనం రూ. 25,000గా ఉంది. యూనిట్ పీఎంఈ జి పి పథకం కింద ఏర్పాటు చేయబడిందని లబ్ధిదారు వివరించారు.
అనంతరం నాగినేనిప్రోలు గ్రామ పంచాయతీని సందర్శించి, పంచాయతీ కార్యాలయం, అంగనావాడి కేంద్రాలు, ప్రైవేట్ పాఠశాలలో ఎంపీపీ ఎస్ పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితులు, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల శుభ్రత మరియు ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అంగన్ వాడి కేంద్రాల్లో పిల్లలకు సరైన పోషకాహారం, 14%-%18 వయస్సు గల యువతకు పాఠశాలల్లో సదుపాయాలు అందిస్తున్నాయో కూడా పరిశీలించారు.
అశ్వపురం మండలంలోని నెల్లిపాక బంజర గ్రామ పంచాయతీ పరిధిలో ఎం రామకృష్ణ మునగా తోటను పరిశీలించి, పంట దిగుబడి, మార్కెట్ సౌకర్యాలు మరియు పంటకు అందుతున్న ఇతర సహాయాలు గురించి రైతుతో చర్చించారు.ఈ పర్యటన ద్వారా మండలాల పంచాయతీలు, విద్యా, సాంఘిక, వ్యవసాయ మరియు సంక్షేమ రంగాల్లోని సౌకర్యాలను పరిశీలించడం, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.
ఈ పరిశీలనలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఎంపీడీవో లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో 15 చెక్ పోస్టుల ఏర్పాటు...



**సీ కె న్యూస్ చింతకాని ప్రతినిధి జి పిచ్చయ్య**
ఆంధ్ర నుండి ఇసుక రవాణా చేసే వాహనాలపై కేసులు నమోదు, జప్తు.
మూడు షిఫ్టులలో 24 గంటలు చెక్ పోస్ట్ ద్వారా పోలీస్, మైనింగ్ అధికారుల పర్యవేక్షణ
పోలీస్ కమిషనర్ సునీల్ దత్..

# విద్యార్థులను మొబైల్ పోన్ దూరంగా ఉంచాలి ... కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ బాబు



**సీ కె న్యూస్ చింతకాని ప్రతినిధి.జి పిచ్చయ్య**
ప్రభుత్వ జూనియర్ కళాశాల నాగులవంచ యందు ఈరోజు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరిగింది... ఈ సమావేశానికి అధ్యక్షులు ప్రిన్సిపాల్ శ్రీ నవీన్ బాబు మాట్లాడుతూ పిల్లలందరినీ మన పిల్లలగా భావించి రేపటి భవిష్యత్తు కోసం వారిని ప్రతినిత్యం మనం కాపాడుతూ ఉండాలని వారి ఎదుగుదలకు మనం మన వంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ముఖ్యంగా సెల్ ద్వారా మీడియా ద్వారా చెడు మార్గాలకు అలవాటు పడుతున్నారని వాటిని అవసరమైన అంత మేరకు ఉపయోగించు విధంగా తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని ప్రిన్సిపాల్ సూచించారు....
అదేవిధంగా మరొక అతిథి శ్రీ సత్య సాయి ట్రస్ట్ సభ్యులు లింగయ్య మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ ఉన్నత మార్గంలో పిల్లల్ని తీర్చిదిద్దాలని సూచించారు.
కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రమ విలువ తెలవాలని రూపాయి విలువ చదువుల పిల్లలకు తెలిసి వచ్చేలా చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతో పాటు శారీరక మానసిక ఆనందాన్ని కూడా కలిగించేలా చేయాలని క్రీడల యోగ పాల్గొనేలా చేయాలని తెలిపారు
కళాశాల ఏజీఎంఓ రాంబాబు పిల్లల క్రమశిక్షణతో మెలిగే విధంగా చూడాల్సిన బాధ్యతలదండలని సూచించారు
కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లయ్య మాట్లాడుతూ పిల్లలు ఆధునిక సమాజం వలన ఏర్పడుతున్న మానసిక రుగ్మతలను ప్రవర్తనను నియంత్రించే విధంగా తల్లిదండ్రులు అధ్యాపకుల సూచించారు .
కళాశాల సీనియర్ అధ్యాపకులు వరప్రసాద్ గారు మాట్లాడుతూ విద్యార్థులు చెడుమాచాలకు అలవాడ పడకుండా నియంత్రించాలని సూచించారు
ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు కళాశాల అధ్యాపకులు అల్లు విజయ్ కృష్ణార్జున విద్యార్థులు నిర్దేశించి ప్రసంగించారు ....

# నేడు ఆదివారం.. ఉదయం 10..గంటలకు

**సీ కె న్యూస్ చింతకాని ప్రతినిధి.జి పిచ్చయ్య** :చింతకాని.సిపిఎం.ఆఫీసులో. మాదిగల ఐక్యవేదిక సమ్మేళనం ఏర్పాటు చేయడం జరిగింది.చింతకాని మండలంలో. ప్రతి గ్రామంలో ఉన్న.మాదిగ జడ్పిటిసిలు. ఎంపీటీసీలు.సర్పంచులు.వార్డ్ మెంబర్స్.వివిధ పార్టీ హెూదా. ఉన్నవారు..పెద్దవారు ముఖ్యంగా..మాదిగ జాతి ముద్దు బిడ్డలు..ప్రతి ఒక్కరు ఆహ్వానితులే..ఏ పార్టీలకు సంబంధం లేకుండా...మాదిగ జాతి మనువాడ కోసం.. ఏర్పాటు చేయడం జరిగింది.. ఎంప్లాయిస్.రిటైర్డ్ ఎంప్లాయిస్. విద్యావంతులు. మేధావులు.మాదిగ జాతి కోసం పోరాడిన వారు.. సమ్మేళనానికి. వచ్చిన ప్రతి ఒక్కరికి సన్మాన..కార్యక్రమం ఉంటుంది..మాదిగ జాతి ముద్దుబిడ్డ లు.. ప్రతి ఒక్క రావాలని... కోరుకుంటూ అంబేద్కర్ నాగరాజు 6301360449

# చిన్నమండవ ఎంపిపిస్ స్కూల్ లో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు....

**బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక.... పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత**



**సీ కె న్యూస్ చింతకాని ప్రతినిధి జి పిచ్చయ్య** :చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో ఉన్నటువంటి ఎంపీపీఎస్ స్కూల్ లో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది.... ఈ పండుగను ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన పండుగ ,ఇది ముఖ్యంగా మహిళలు జరుపుకునే పండుగ బతుకమ్మ అనగా బతుకు అమ్మ అని అర్థం. అంటే మన కుటుంబం ,పిల్లలు ,భర్త ,తల్లిదండ్రులు అందరూ సుఖసంతోషాలతో బతకాలని ప్రార్థించటమని, ఈ పండుగను అశ్వయుజ శుద్ధ పద్మి నుండి తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారని ,చివరి రోజు " సద్దుల బతుకమ్మ అంటారని, బతుకమ్మ పండుగలో రంగురంగుల పూలతో, పెద్ద బొమ్మ లాంటి పూలదండలు తయారుచేసి వాటిని నది లేదా చెరువు లేదా బావిలో వదిలేస్తారు అని ,మహిళలు సాంప్రదాయ బట్టలు ధరించి బతుకమ్మ చుట్టూ చేరి పాటల పాడుతూ ఆటలాడుతూ ఈ పండుగలో తల్లి భూదేవిని, గౌరీదేవిని పూజిస్తారని ,కుటుంబంలో సుఖసంతోషాలు ,ఆరోగ్యం ,సంపద సంతానం, కోసం పూజ చేస్తారని వివరించడం జరిగింది... ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్ అంగన్వాడీ టీచర్ నిర్మల , స్కావెంజర్ మోదుగు పుల్లమ్మ, గద్దలఅంజమ్మ పాల్గొన్నారు...

# ఇసుక అక్రమ రవాణాకు జరగకుండా చర్యలు.

**సీపీ ఆదేశాలతో చెక్ పోస్ట్ ఏర్పాటు.**

**సీ కె న్యూస్ చింతకాని ప్రతినిధి జి పిచ్చయ్య** :ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు రాష్ట్ర,జిల్లా సరిహద్దుల్లో 15 చెక్ పోస్టుల ఏర్పాటు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది ఆంధ్ర నుండి ఇసుక రవాణా చేసే వాహనాలపై కేసులు నమోదు,జప్తు మూడు షిఫ్టులలో 24 గంటలు చెక్ పోస్ట్ ద్వారా పోలీస్,మైనింగ్ అధికారుల పర్యవేక్షణ ఉండేలా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలు తో చింతకాని సబ్ ఇన్స్పెక్టర్ వీరేందర్ మండల పరిధిలోని సీతంపేట వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు.చెక్ పోస్ట్ వద్ద పోలీసులు పి



సారయ్య,వెంకటేశ్వర్లు,దుర్గా ప్రసాద్ వాహనాల్ని తనిఖీ చేసి వివరాలు సేకరించారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి కాంగ్రెస్ పార్టీ



**సెప్టెంబర్ 20 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల గ్రామలలో వికలాంగుల హక్కుల పోరట సమీతి ఎమ్మర్పిఎస్ ల అద్వర్యం లొ రెపరేండం గ్రామ పంచాయతీ సెక్రటరీ కి ఇవ్వడం జరుగుతుంది ఇందులో బాగంగా రుక్మపూర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ బాలు కి రెపరేండం ఇవ్వడం జరిగింది. ముక్యమంత్రి ఇచ్చిన మాట నిలపెట్టుకోవలనీ వికలంగులకు 4000 నుండి 6000 ఓంటరి. గిత. బిడీ. వితంతు అసర. చేయుతలకు 2000 నుండి 4000 లు పేంచలని డీమండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బుమయ్య, దేవస్వామీ. రఘుపతి. పొచయ్య. ఎమ్మార్పిఎస్ చేగుంట మండల అద్యక్షులు కొలుపుల రామస్వామి. ఉపద్యక్షడు నీల రాములు. దాస్. సతయ్య. నరుసవ్వ. ఎరుకుల ఎల్లయ్య. తద్దితరులు పాల్గొన్నారు,

# చిన్నమండవ మున్నేరు ప్రాంతాన్ని పరిశీలించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి



**సీకే న్యూస్ చింతకాని ప్రతినిధి జి పిచ్చయ్య** :చింతకాని మండలం
చిన్నమండవ గ్రామంలో గత 5నెలల కాలం ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి ట్రాక్టర్ వేయి రూపాయల వసూలు చేస్తున్న విషయం తెలిసిందే, స్థానికులు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నమండవ మునేరు ప్రాంతాన్ని పరిశీలించారు... పట్టా పాస్ బుక్కులు కలిగిన వ్యక్తులు ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుక ర్యాంపు ఏర్పాటుచేసిరు... అట్టి రాంపులను జెసిబి తో తొలగించడం జరిగింది... ప్రభుత్వ అనుమతితో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉచిత ఇసుక వచ్చేలా కలెక్టర్ గారికి నివేదిక ఇస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తెలియజేశారు.... ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని. గ్రామస్తులు తెలిపారు...ఈ కార్యక్రమంలో ముదిగొండ చింతకాని ఎమ్మార్వో బాబ్జి ప్రసాద్, ఎలిశబెత్ రాణి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఏకకర్ణ, జగదీష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు...

# నాగులవంచ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు.





**సీ కె న్యూస్ చింతకాని ప్రతినిధి జి పిచ్చయ్య** : మండల పరిధిలోని నాగులవంచ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో బతుకమ్మ లాడినారు .కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశాఖలో బడ్డీ కొట్ల తొలగింపు తక్షణం ఆపాలి

- వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాకే ముందుకెళ్లాలి
- విశాఖ జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు కెకె రాజు డిమాండ్
- పార్టీ నగర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన విశాఖ జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు కెకె రాజు
- వీధి వ్యాపారుల దుకాణాల తొలగింపు వెనుక భారీ కుట్ర
- పథకం ప్రకారం ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు లేని సమయంలో కూల్చివేతలు
- హాకర్స్‌కి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేయడం దారుణం
- విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా అలజడి సృష్టిస్తున్నారు
- విశాఖ అభివృద్ధి చెందితే అమరావతికి పెట్టుబడులు రావని చంద్రబాబుకి భయం
- కూటమి ప్రభుత్వం కుట్రలు బట్టబయలు చేసిన కెకె రాజు

**విశాఖపట్నం సీ కే న్యూస్** వీధి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న హాకర్లపై కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని, కనీసం ముందస్తు నోటీసులు కూడా ఇవ్వకుండానే వారు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను జేసీబీలతో నేలమట్టం చేశారని విశాఖ జిల్లా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షులు కెకె రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖలోని పార్టీ సిటీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ షాపుల అక్రమ తొలగింపు గురించి వైయస్ఆర్‌సీపీ ప్రశ్నిస్తుంటే మాకేం సంబంధం లేదని జీవీఎంసీ అధికారులు, పోలీసులు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని.. పక్కా కుట్రతోనే ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నగరంలో లేని సమయంలో ఈ కూల్చివేతలకు కూటమి ప్రభుత్వం ప్లాన్ చేసిందని కెకె రాజు ఆరోపించారు. బాధితులకు ప్రత్యామ్నాయం చూపే వరకు షాపులు, ఫుడ్ కోర్టు తొలగిస్తే అంగీకరించేది లేదని కెకె రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. షాపుల అక్రమ తొలగింపుపై సోమవారం వైయస్ఆర్‌సీపీ నాయకులంతా జీవీఎంసీ కమిషనర్‌ని కలుస్తామని స్పష్టం చేశారు. వైయస్ఆర్‌సీపీ హయాంలో వీధి వ్యాపారులకు ఇబ్బంది లేకుండా హాకర్స్ జోన్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా వీధి వ్యాపారాలను ప్రోత్సహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆనాడు వ్యాపారుల కోసం జోన్లు ఏర్పాటు చేసిన జీవీఎంసీ అధికారులే నేడు కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**పక్కా ప్లాన్‌తో కుట్రపూరితంగా దుకాణాల తొలగింపు**

విశాఖ నగరంలో రోడ్డుపై రకరకాల వ్యాపారాలు చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్న స్ట్రీట్ వెండార్ల పట్ల ఈ ప్రభుత్వం అత్యంత క్రూరంగా వ్యవహరిస్తోంది. రోడ్డుపైనే రకరకాల వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న వేలాది కుటుంబాలను కూటమి ప్రభుత్వం రోడ్డు పాలు చేసింది. రోడ్డుపై వ్యాపారం చేసుకునే వారందరికీ మేలు కలిగేలా గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో హాకర్స్ జోన్లు ఏర్పాటు చేసి జీవీఎంసీ ద్వారా ట్రేడ్ లైసెన్స్ ఇచ్చి వ్యాపారాలు కొనసాగించుకునే అవకాశం కల్పించడం జరిగింది. కానీ గత రెండు రోజులుగా నాటకీయ పరిస్థితుల మధ్య వ్యాపారులెవరికీ కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా అత్యంత అమానవీయంగా దౌర్జన్యంగా జేసీబీలను తీసుకొచ్చి బడ్డీ కొట్లను ధ్వంసం చేస్తున్నారు. ఈ విధ్వంసం గురించి కూటమి నాయకులెవరికీ తెలియదని బాధిత వ్యాపారులకు, నగర ప్రజలకు భ్రమ కల్పించేందుకు కార్పొరేటర్లను మేయర్‌తో సహా స్టడీ టూర్ పేరుతో విజయవాడకి పంపారు. ఇంకోవైపు కూటమి ఎమ్మెల్యేలంతా అసెంబ్లీ సమావేశాల పేరుతో మూడు రోజులుగా రాజధానిలోనే ఉంటున్నారు. పక్కా కుట్రతో ఇలాంటి అవకాశాన్ని వారే సృష్టించుకుని వ్యాపారుల మీద జేసీబీలతో విరుచుకుపడ్డారు. షాపులను ఎవరు తొలగించమంటున్నారని పోలీసులను ప్రశ్నిస్తుంటే జీవీఎంసీ అధికారులేమో పోలీస్ కమిషనర్ తొలగించమని చెప్పారని, పోలీసులను అడిగితే జీవీఎంసీ కమిషనర్ తొలగించమన్నారని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడితే అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్న కొన్ని షాపులను మాత్రమే తొలగించమని చెప్పామని అంటున్నారు. ఇతర షాపులు, ఫుడ్ కోర్టులు, మెకానిక్ షాపులు తొలగించమని చెప్పలేదని వారే చెబుతున్నారు. ఒకవైపు రోడ్డు విస్తరణ పనులకు వ్యతిరేకం అంటూనే వీధి వ్యాపారుల పొట్ట కొట్టడం దుర్మార్గం.

**విశాఖ నగరం మీద కూటమి కుట్ర**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విశాఖ మీద కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే విశాఖలో కోట్ల విలువైన భూములను పప్పు బెల్లాలకు తన వారికి కట్టబెట్టి సొత్తంతా విజయవాడకు తరలించుకుపోతున్నారు. ఇప్పుడు ఏకంగా రోడ్డు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వారిని సైతం రోడ్డుపాలు చేశారు. ఇలాంటి విధానం సరైంది కాదు. దీన్ని వైయస్ఆర్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపించిన తర్వాతే ఆక్రమణలు తొలగించాలి. గతంలో వైయస్ఆర్‌సీపీ హయాంలో విశాఖ అభివృద్ధిలో భాగంగా ప్రతి జంక్షన్ ను అభివృద్ధి చేశాం. ఈ కార్యక్రమంలో వీధి వ్యాపారులకు ఎలాంటి నష్టం జరగకుండా 24 హ్యాకర్ జోన్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాం. అభివృద్ధి కార్యక్రమాల్లో ఏదైనా నిర్మాణాలు తొలగించాల్సి వస్తే బాధితులతో మాట్లాడి వారికి నష్టపరిహారం ఇచ్చిన తర్వాతనే ప్రభుత్వం ముందుకెళ్లిందే కానీ ఎలాంటి దుందుడుకు చర్యలు తీసుకోలేదు.

**వైయస్ఆర్‌సీపీ హయాంలో హాకర్స్ జోన్ల ఏర్పాటు**

ప్రభుత్వానికి చేతనైతే అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను, పార్కింగ్ లేకుండా నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్సులను కూల్చివేయాలి. వాటి మీద చర్యలు తీసుకున్న తర్వాతే వీధి వ్యాపారుల జోలికొస్తే బాగుంటుంది. అంతేకానీ రెక్కాడితే కానీ డొక్కాడని వ్యాపారులను రోడ్డుపాలు చేస్తే వైయస్ఆర్‌సీపీ చూస్తూ ఊరుకోదు. ప్రత్యామ్నాయం చూపించే వరకు షాపుల తొలగించే పనులు ఆపేయాలి. వ్యాపారుల ఇబ్బందులను మానవీయ కోణంలో చూడాలే కానీ ఏకంగా దుకాణాలనే జేసీబీలతో కుప్పకూల్చడం దారుణమైన చర్య. వారికి కోరినంత సమయం ఇవ్వాలి. ప్రభుత్వం కూల్చిన చాలా దుకాణాలు 20 ఏళ్లకుపైగా వ్యాపారాలు జరుగుతున్నవే. ముందూ వెనుక చూడకుండా ప్రైవేటు స్థలంలో ఉన్న నిర్మాణాలను సైతం ఇష్టారాజ్యంగా కూల్చేస్తున్నారు.

**అమరావతి కోసం విశాఖ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారు**

కూటమి ప్రభుత్వం అమరావతి ఇమేజ్ ని పెంచడానికి విశాఖ బ్రాండ్‌ను నాశనం చేస్తున్నారు. పెట్టుబడులన్నీ అమరావతికి తరలిస్తున్నారు. ఇంటర్నేషనల్ మీటింగ్‌లు ఏర్పాటు చేసుకోవడానికి అమరావతి బాగుండదు కనుక వాటి కోసం మాత్రమే విశాఖను ఫంక్షన్ హాల్‌లా వాడుకుంటున్నారు. విశాఖ అభివృద్ధి చెందితే అమరావతికి పెట్టుబడులు రావనేది చంద్రబాబు భయం. అందులో భాగంగానే విశాఖపట్నం ప్రశాంతమైన నగరం కాదనే ముద్ర వేసే కుట్రలు జరుగుతున్నాయి. దానికోసం ప్రశాంత నగరంలో పదే పదే అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. బాధితులకు ప్రత్యామ్నాయం చూపించే వరకు కూడా వైయస్ఆర్‌సీపీ పోరాడుతుంది. హాకర్ల తరఫున సోమవారం జీవీఎంసీ కమిషనర్‌ని కలిసి వారి ఉపాధికి నష్టం జరగకుండా న్యాయం చేయాలని కోరతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపైన, వారు చెప్పినట్టు అసాంఘిక కార్యక్రమాలు జరిగి ఉంటే వారిపై మాత్రమే చర్యలు తీసుకోవాలే కానీ అందర్నీ ఇబ్బంది పెట్టడం తగదు. వ్యాపారుల సమస్యల పట్ల మానవీయకోణంలో ఆలోచించాలి.


## రాయచోటి ఘటనపై వైయస్ జగన్ దిగ్భ్రాంతి

**మురుగు కాలువల్లో కొట్టుకుపోయి నలుగురు మృతి చెందడం విచారకరం**

**తాడేపల్లి: సీ కే న్యూస్** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నలుగురు మృత్యువాత పడిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ దిగ్ర్భాంతి, విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి వరదనీటిలో కొట్టుకుపోయి షేక్ ముని, ఇలియాస్, గణేష్, చిన్నారి యామిని మృతి చెందారు. నిన్న రాత్రి గల్లంతైన బాలిక యామిని మృతదేహాన్ని ఇవాళ ఉదయం గుర్తించారు. మురుగు కాలువల్లో కొట్టుకుపోయి నలుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని వైయస్ జగన్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జర్నలిస్టులకు అండగా ప్రభుత్వం: మంత్రి వివేక్

- దళిత జర్నలిస్ట్ ఫోరం డిమాండ్స్ ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తా : వెన్నెల గద్దర్
- మంత్రిని శాలువాతో సన్మానించిన వ్యవస్థాపకులు కాశపోగు జాన్.
- బొకే అందజేసి స్వాగతం పలికిన వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్.
- 10వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు:
- ఫోరం అధ్యక్షుడు కాశపోగు జాన్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), సెప్టెంబర్ 20,** దళిత జర్నలిస్ట్ ఫోరం డిమాండ్స్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా చూస్తారని, కార్మిక శాఖ మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం హైదరాబాదు రవీంద్ర భారతి లోని దళిత జర్నలిస్ట్ ఫోరం 10వ రాష్ట్ర మహాసభలకు మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరి అదే విధంగా సంస్కృతిక శాఖ సారథి చైర్ పర్సన్ డాక్టర్: వెన్నెల గద్దర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మేడి రమణ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి, ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ హ్యాట్రిక్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, దళిత జర్నలిస్ట్ ఫోరం గౌరవ సలహాదారులు కృష్ణారెడ్డి, ఏఐసీసీ నాయకుడు కేతూరి వెంకటేష్, దరువు ఎల్లన్న, ఉస్మానియా యూనివర్సిటీ నాయకుడు ప్రసాద్, దళిత జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశపోగు జాన్, దళిత జర్నలిస్టు ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రత్నకుమార్ రాష్ట్ర నాయకులతో కలిసి, మంత్రి వివేకు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ. దళితుల అభివృద్ధికి కాక వెంకటస్వామి ఎంతో అభివృద్ధి చేశారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా తను కూడా దళిత జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. దళిత జర్నలిస్ట్ ఫోరం సభ్యులకు తను అండగా ఉంటారని ఏ అవసరం ఉన్న తనను సంప్రదించాలని తెలిపారు. వెన్నెల గద్దర్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, నిష్పక్షపాతంగా వార్తలు రాస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే కలం యోధులందరికీ, దళిత జర్నలిస్ట్ ఫోరం 10వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంలో విలేకరుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ జర్నలిస్టులను మెమొంటోస్ తో ఘనంగా సత్కరించారు. మంత్రి వివేక్ జర్నలిస్టులకు బ్యాగులను అందజేశారు. జాతీయ అధ్యక్షుడు కాశపోగు జాన్, కమిటీ సభ్యులతో కలిసి ముఖ్య అతిథులను ఘనంగా శాలువా మమెంటోస్ తో ఘనంగా సన్మానించారు. దళిత జర్నలిస్ట్ ఫోరం సభ్యులకు ప్రతి ఒక్కరిని శాలువతో సన్మానించి, మెమొంటో, సర్టిఫికెట్, బ్యాగ్ లను అందజేశారు. కళాకారుల ఆటపాటలు ఎంతో చైతన్యాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్ట్ ఫోరం తెలుగు రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, తెలంగాణ వర్కింగ్ కార్యదర్శి ధనుష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఎల్లేష్, జగత్ ప్రకాష్, యాదగిరి, కర్రోళ్ల అన్నమ్మ, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు దొమ్మాటి శివకుమార్, సీనియర్ జర్నలిస్టు వార్త రాములు, కార్యవర్గ సభ్యులు రఘురాజు, యాదగిరి, శ్రీకాంత్, రాయుడు, వివిధ జిల్లాల దళిత జర్నలిస్ట్ లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవం...




**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, సీ కే న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్ నందు దసరా సెలవుల కారణంగా ముందస్తుగా( సెప్టెంబర్ 24) శనివారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు చదువుతోపాటు సేవా భావాన్ని కూడా పెంచుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మాజీ అధ్యక్షులు, రిటైర్డ్ ప్రొఫెసర్, కవి, రచయిత కసిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ శతజయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24న కేంద్ర ప్రభుత్వం క్రీడలు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించిందని దీని యొక్క ప్రధాన ఆశయం విద్యార్థి దశలోనే యువతకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సమాజంతో కలిసి పనిచేయడం, సమాజం పట్ల బాధ్యత, సమాజ సేవ, వంటి అంశాల పట్ల అవగాహన కల్పిస్తూ వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే ఎన్ఎస్ఎస్ ఆశయమని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు సమాజం పట్ల సేవా దృక్పథాన్ని కలిగి ఉండి, అవకాశం వచ్చినప్పుడల్ల సమాజ సేవ చేయాలని, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఇందిరా, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. బి. నరసింహ, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డా. డి. మధు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఈ. యాదగిరి రెడ్డి, డా. ఎస్. శారదా దేవి, ఎన్సిసి ఆఫీసర్ ధనరాజ్, అధ్యాపకులు ప్రొఫెసర్ నాగేంద్ర, డా. అపర్ణ చతుర్వేది, డి రమాదేవి, డా. గీతా నాయక్, డా. పులి రమాదేవి, డా. వెంకటలక్ష్మి, డా. విజయలక్ష్మి, డా. డి. శ్రీపతి నాయుడు, డా. ఎన్. వెంకటేశ్వర్లు, డా. వి.నాగరాజ్, డా. డి. మాక్ల, అవేస్ మొహియుద్దీన్, శశిధర్, బాల నరసింహ, యాదయ్య, విద్యాసాగర్, మహబూబ్, బాల, యాదగిరి, నరసింహ, ఫిజికల్ డైరెక్టర్ అనిత, లైబ్రేరియన్ డా. ఎ. దుర్గాప్రసాద్, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన బొడ్డెమ్మ వేడుకలు

**:నర్సంపేట సీ కే న్యూస్ :** నర్సంపేట పట్టణంలోని ప్రగతి నగర్ కాలనీలో బొడ్డెమ్మ వేడుకలు శనివారం రోజున ముగిసాయి. ఈ వేడుకలను ఉద్దేశించి బొడ్డెమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు.. మాట్లాడుతూ... గత పది సంవత్సరాల నుంచి బొడ్డెమ్మ వేడుకలను సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించుకుంటామని ఈ బొడ్డెమ్మ వేడుకలు కాలనీలోని మహిళలు యువతులు పాల్గొని ఆటపాటలతో కోలాటం వేస్తారు. ఈ తొమ్మిది రోజులు బొడ్డెమ్మ వేడుకలను రకరకాల పూలతో అలంకరించి ధూప నైవేద్యాలు సమర్పించి భక్తితో కొలుస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో మహిళలు కుంటి వజ్రమ్మ, సుశీల, ముత్యాల పల్లవి, శ్రావణి, తవిటి అరుణ, గొర్రె స్వరూప, మానస, పెండ్యాల దీక్షిత, తదితరులు పాల్గొన్నారు.



CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

## చెవిలో మోత తగ్గుతుందిలా

బయట ఎలాంటి చప్పుడూ ఉండదు. కానీ ఏదో మోగుతున్నట్టు వినిపిస్తూనే ఉంటుంది. ఎప్పుడో అప్పుడో కాదు.. నిరంతరం అదే చప్పుడు. దాని మీదికి ధ్యాస మళ్లితే ఇంకాస్త ఎక్కువగానూ వినిపిస్తుంటుంది. చెవిలో మోత (టినిటస్) ఇలాగే వేధిస్తుంది. ఇది ఏకాగ్రత కొరవడటం, నిద్ర సరిగా పట్టకపోవటం, చిరాకు, ఆందోళన, కుంగుబాటు, నిరాశ వంటి వాటికీ దారితీస్తుంది. మానసికంగా, శారీరకంగా తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. కొందరు నలుగురిలో కలవలేక ఒంటరిగానూ ఉండిపోతుంటారు. చెవిలో మోతను నయం చేయటం అన్నిసార్లూ సాధ్యం కాకపోయినా కొన్ని జాగ్రత్తలతో లక్షణాలను తగ్గించుకోవచ్చు.

**కారణాలను తెలుసుకోవటం**

వినికిడిలోపం గలవారిలో చెవిలో మోత తరచూ కనిపిస్తుంటుంది. కొన్నిరకాల మందుల దుష్ప్రభావమూ కారణం కావొచ్చు. అరుదుగా శ్రవణ నాడిని నొక్కే కణితులతోనూ రావొచ్చు. కాబట్టి చెవి, ముక్కు, గొంతు నిపుణులను సంప్రదించి కారణాలను గుర్తించటం మంచిది. వాటికి చికిత్స తీసుకుంటే మోత నయం కావొచ్చు. లేదూ తీవ్రతైనా తగ్గించుకోవచ్చు.

**వినికిడి సాధనాలు**

వినికిడి లోపం గలవారు వినికిడి సాధనాలను వాడుకుంటే మేలు. ఇవి బాగా వినిపించేలా చేయటమే కాకుండా మోత తగ్గటానికీ తోడ్పడతాయి.

**మాస్కింగ్ పరికరం**

వినికిడి సాధనంగా కనిపించే మాస్కింగ్ పరికరాలు సహజ శబ్దాలను పుట్టించటం ద్వారా మోత మరుగున పడేలా చేస్తాయి. ఈ శబ్దాలు మెదడు దృష్టిని మళ్లించి, మోత తగ్గిన భావన కలిగిస్తాయి. వినికిడి సాధనంతో కూడిన మాస్కింగ్ పరికరాలూ అందుబాటులో ఉన్నాయి. వీటితో రెండు సమస్యలకూ పరిష్కారం లభిస్తుంది. పరికరం వద్దనుకుంటే తేలికైన చిట్కానూ పాటించొచ్చు. రాత్రిపూట మంచం పక్కన రేడియో, స్మార్ట్‌ఫోన్ వంటి వాటితో ఇష్టమైన సంగీతాన్ని వినొచ్చు. ఫ్యాను చప్పుడైనా సరే. మొత్తమ్మీద మెదడును దారి మళ్లించే శబ్దాలు ఏవైనా ఉపయోగపడతాయని గుర్తించాలి.

**ప్రేరకాల గుర్తింపు**

ఏయే సందర్భాల్లో చెవిలో మోత ఎక్కువగా బాధిస్తోందో గుర్తించి, వాటి జాబితా రాసుకోవాలి. దీంతో మోత ఎప్పుడు వేధిస్తుందో అంచనా వేయొచ్చు, దాన్ని నివారించుకోవచ్చు. ఉదాహరణకు- మద్యం, కెఫీన్ పానీయాలు తాగిన తర్వాత మోత ఎక్కువవుతోందనుకోండి. ఇలాంటి వాటికి దూరంగా ఉంటే మోతను తగ్గించుకునే అవకాశముంది.

**వ్యాయామం**

రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మోత తీవ్రత, దీంతో కలిగే అసౌకర్యం తగ్గుతాయి. వ్యాయామంతో మొత్తంగా ఆరోగ్యం మెరుగవుతుంది. కంటి నిండా నిద్ర పడుతుంది. ఇవి రెండూ చెవి మోత తగ్గటానికి తోడ్పడేవే.

**ధ్యానం, ప్రాణాయామం**

మనసును కుదురుగా నిలిపే ధ్యానం, ప్రాణాయామం కూడా మేలు చేస్తాయి. ఇవి కుంగుబాటు, ఆందోళన తగ్గిస్తాయి. నలుగురితో కలివిడితనం పెరుగుతుంది. చెవిలో మోత గలవారిలో మానసిక ఆరోగ్యం మెరుగవటానికివి తోడ్పడతాయి.

**ఒత్తిడి తగ్గించుకోవాలి**

మానసిక ఒత్తిడి చెవిలో మోత భావన పెరిగేలా, దానికి అతిగా స్పందించేలా చేస్తుంది. కాబట్టి ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి.

**నలుగురితో కలివిడిగా**

కొన్నిసార్లు చెవి మోత భరించలేని స్థితికి చేరుకోవచ్చు. ఇది ఒంటరితనానికి, మోత మీద ధ్యాస మరింత ఎక్కువగా పెట్టటానికి దారితీస్తుంది. కాబట్టి మనసుకు ఆనందం కలిగించేవారితో గడిపేలా చూసుకోవాలి. కనీసం ఫోన్‌లో మాట్లాడినా, మెసేజ్‌లతో చర్చించినా చాలు. దీంతో మోత మీది నుంచి దృష్టి మళ్లుతుంది. హాయి, ఆనందం, ఆశావహ దృక్పథం పెరుగుతాయి.

**కౌన్సెలింగ్**

చెవి మోత మరీ ఇబ్బంది పెడుతుంటే మానసిక నిపుణులను సంప్రదించి, కౌన్సెలింగ్ తీసుకోవటం మంచిది. ఇందులో మోతకు సంబంధించిన ప్రతికూల ఆలోచలను గుర్తించేలా.. ఆలోచన విధానాన్ని, మోతకు స్పందించే తీరును మార్చుకునేలా శిక్షణ ఇస్తారు.

# ‘చక్కని గుండె’ కోసం అమెరికా హార్ట్ అసోసియేషన్ సూచిస్తున్న ఆహారం

### గుండె జబ్బుల విషయంలో ఆహారం కీలక పాత్ర

### కొన్ని రకాల ఆహారంతో రక్తపోటు, కొలెస్ట్రాల్ ముప్పు

### నాలుగు రకాల డైట్ నమూనాలను వెల్లడించిన యూఎస్ సంస్థ



తీసుకునే ఆహారం, జీవనశైలి గుండెపై ఎంతో ప్రభావం చూపిస్తాయి. నేడు గుండె జబ్బులు పెరిగిపోవడానికి ఆహారం విషయంలో సరైన నియమాలు పాటించకపోవడం ప్రధాన కారణం కాగా, సరైన నిద్ర లేకుండా, శారీరక వ్యాయామం లేని జీవన విధానం కూడా ప్రభావం చూపిస్తోంది. మరి ఈ క్రమంలో గుండెకు హాని చేయని ఆహారం ఏది? అన్న సందేహం ఎక్కువ మందికి వస్తుంటుంది. ఎందుకంటే ఆహారం విషయంలో ఒక్కొక్కరు ఒక్కో రకంగా చెబుతుండడంతో పెద్ద అయోమయం నెలకొంది. అందుకే అమెరికన్ హార్ట్ అసోసియేషన్ గుండె జబ్బుల రిస్క్ ను తగ్గించే పలు రకాల డైట్ వివరాలను విడుదల చేసింది.

**ఆహారం పాత్ర**

గుండె జబ్బుల విషయంలో ఆహారం పాత్ర కచ్చితంగా ఉంటుంది. మనం తీసుకునే ఆహారం రక్తపోటు నియంత్రణపై ప్రభావం చూపిస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. ఈ రెండూ గుండె జబ్బులకు కారణమయ్యే పెద్ద సమస్యలు. కనుక రక్తపోటు, కొలెస్ట్రాల్ ను పెంచని ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

**డాష్ డైట్**

డాష్ అంటే.. డైటరీ అప్రోచెస్ టు స్టాప్ హైపర్ టెన్షన్. రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు రూపొందించిన ఆహార నమూనా ఇది. ఉప్పు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలను తీసుకోవాలి. పాల ఉత్పత్తులు తీసుకోవచ్చు కానీ తక్కువ ఫ్యాట్ ఉండేవి ఎంపిక చేసుకోవాలి. లీన్ ప్రొటీన్ తీసుకోవాలి.

**పెస్కాటేరియన్ డైట్**

ఇది శాకాహారం. పండ్లు, కూరగాయలు, నట్స్, సీడ్స్, తృణ ధాన్యాలు, డైరీ ఉత్పత్తులను ఈ ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. మీట్, చికెన్ కు దూరంగా ఉండాలి. కావాలంటే చేపలను తీసుకోవచ్చు.

**మెడిటెర్రానియన్ డైట్**

ఇది మంచి సమతులాహారం. ఆరోగ్యకరమైన ఆహారంగా దీనికి గుర్తింపు కూడా లభించింది. మొక్కల ఆధారిత ఆహారం ఇది. తృణ ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, నట్స్, మూలికలు, దినుసులు, పప్పు ధాన్యాలను ఇందులో భాగంగా తీసుకోవాలి. యుగర్ట్, చీజ్, చికెన్, గుడ్లను పరిమితంగా తీసుకోవచ్చు.

**లాక్టో ఓవో వెజిటేరియన్ డైట్**

మొక్కల ఆధారిత ఆహారానికితోడు డైరీ ఉత్పత్తులు, గుడ్లను ఇందులో తీసుకోవచ్చు. గుడ్లు మినహా చికెన్, చేపలు, మీట్ ను కూడా తీసుకోకూడదు.

# డయాబెటిస్ ఉన్న వారు పుచ్చకాయ తినొచ్చా..?

### పుచ్చకాయలో గ్లైసిమిక్ ఇండెక్స్ కొంచెం ఎక్కువే

### అయినా 92 శాతం నీరు, మిగిలినది ఫైబర్

### విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ, కేలరీలు తక్కువ

### మోస్తరుగా తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు






వేసవిలో ఎక్కువ మంది ఇష్టంగా తినే పండ్లలో పుచ్చకాయ కూడా (వాటర్ మెలాన్) ఒకటి. రుచితో పాటు అధిక శాతం నీరు ఉండే పుచ్చకాయ పోషకాల నిలయం. పుచ్చకాయలో సహజ చక్కెర పరిమాణం అధికంగా ఉంటుంది. దీంతో దీన్ని డయాబెటిస్ సమస్యతో బాధపడుతున్న వారు తినొచ్చా? అన్న సందేహం వస్తుంటుంది. దీనికి నిపుణులు పరిమితంగా తినొచ్చని సూచిస్తున్నారు. వాటర్ మెలాన్ లో కేలరీలు తక్కువగా ఉంటాయి. విటమిన్ ఏ, సీ, ఫైబర్ ఉండడం అనుకూలం. లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కూడా లభిస్తుంది. ఇది కేన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణనిచ్చే యాంటీ ఆక్సిడెంట్. పుచ్చకాయలో 92 శాతం నీరే ఉంటుంది. మిగిలినది ఫైబర్. కనుక పండ్లలో ఇదొక మంచి ఎంపిక అవుతుంది. అధిక నీటి పరిమాణం వల్ల వేసవిలో శరీరంలో తగినంత నీటి పరిమాణం ఉండేందుకు ఈ పండు అనుకూలిస్తుంది. ఇందులో ఫొలేట్, పొటాషియం, ఫైటో కెమికల్స్, మినరల్స్ కూడా ఉంటాయి.

వాటర్ మెలాన్ గ్లైసిమిక్ ఇండెక్స్ 72. ప్రతీ పదార్థానికీ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉంటుంది. అంటే తిన్న తర్వాత ఎంత వేగంగా గ్లూకోజ్ గా మారిపోతుందన్నది ఈ ఇండెక్స్ చెబుతుంది. జీఐ 72 అంటే మోస్తరు నుంచి అధికం అని అర్థం. మధుమేహులు జీఐ తక్కువగా ఉన్నవి తీసుకుంటే మంచిది. మరి పుచ్చకాయలో జీఐ కొంచెం ఎక్కువగా ఉన్నందున తీసుకోవచ్చా? అన్న సందేహం తప్పకుండా వస్తుంది. కాకపోతే పుచ్చకాయలో 92 శాతం నీరు, మిగిలినది ఫైబర్ అవ్వడం వల్ల, తిన్న వెంటనే అది గ్లూకోజ్ గా మారిపోదు. ఫైబర్ ఉండడం వల్ల నిదానంగానే రక్తంలోకి విడుదల అవుతుంది. అందుకని పరిమితంగా తీసుకోవడం మధుమేహులకూ మంచిదే.

# బాలీవుడ్ బ్రిలియన్స్‌తో తారా సుతారియా బీచ్ బేబ్



# చీరకట్టులో కవ్విస్తోన్న రెజీనా.. ఎంత అందంగా ఉందో!

రెజీనా కసాండ్రా.. 1988 డిసెంబర్ 13న తమిళనాడు చెన్నైలో జన్మించిన ఈమె.. మోడల్ గా తన కెరీర్ ను మొదలు పెట్టిం ది.. అలా మోడలింగ్ చేస్తున్న సమయంలోనే దర్శక నిర్మాతల కంట్లో పడ్డ ఈమె 2012లో 'శివ మనసులో శృతి' అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మహేష్ బాబు బావ సుధీర్ బాబు హీరోగా వచ్చిన ఈ సినిమాలో తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. అంతేకాదు ఈ సినిమాలో అద్భుతమైన నటన కనబరిచినందుకుగానూ ఉత్తమ ఫిమేల్ తొలి పరిచయం విభాగంలో సైమా అవార్డును కూడా అందుకుంది.తర్వాత రొటీన్ లవ్ స్టోరీ, కొత్తజంట, పిల్ల నువ్వు లేని జీవితం, పవర్, రారా కృష్ణయ్య , సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ అంటూ పలు చిత్రాలలో నటించింది. 2012లో తెలుగు తెరకు పరిచయమైనా.. 2005లోనే ఈమె సినీ రంగ ప్రవేశం జరిగిపోయింది. అలా 2005లో తమిళంలో వచ్చిన 'కందనాళ్ ముదల్' అనే సినిమా ద్వారా నటిగా ఇండస్ట్రీకి పరిచయమై.. అటు తమిళ్ ఇటు తెలుగు చిత్రాలలో నటించింది. ఇండస్ట్రీకి వచ్చి దాదాపు రెండు దశాబ్దాలకు పైగానే అవుతున్నా.. వరుస సినిమాలు చేసి ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. ఇప్పటికీ వరుస ప్రాజెక్టులతో మరింత బిజీగా మారిపోయింది.ఒకవైపు సినిమాలు.. మరొకవైపు వెబ్ సిరీస్ లు అంటూ ప్రేక్షకులను అలరిస్తున్న రెజీనా చివరిగా 'కేసరి చాప్టర్ 2' అనే హిందీ చిత్రంతో ప్రేక్షకులను



పలకరించింది. ప్రస్తుతం 5 తమిళ్ ప్రాజెక్టులలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అలా నయనతార లీడ్రోల్ పోషిస్తూ వస్తున్న 'మూకుత్తి అమ్మన్ 2' సినిమాలో నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. దీనిని తెలుగులో అమ్మోరు తల్లి 2 గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాతో పాటు ఫ్లాష్ బ్యాక్, బోర్డర్, పార్టీ, కల్లా పార్ట్ వంటి చిత్రాలలో కూడా నటిస్తోంది. అలాగే మారీచికా అనే మలయాళం సినిమాతో పాటు సెక్షన్ 108 అనే హిందీ చిత్రంలో కూడా నటిస్తోంది.అంతేకాదు ప్రస్తుతం తెలుగులో బుల్లితెరపై ఢీ వంటి షోలలో కూడా నటిస్తూ సందడి చేస్తోంది రెజీనా కసాండ్రా. అభిమానులను అలరించడానికి ఈ మధ్య ఎక్కువగా సోషల్ మీడియాను ఫాలో అవుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే తాజాగా చీరకట్టులో కనిపించి అభిమానులను అబ్బురపరిచింది. ముత్యాలతో చాలా అందంగా డిజైన్ చేసిన చీర ధరించి తన అందంతో అభిమానులను సైతం ఆకట్టుకుంది.రెజీనా కసాండ్రా షేర్ చేసిన ఈ చీర ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు ఇక రెజీనా వ్యక్తిగత విషయానికి వస్తే.. 37 సంవత్సరాల వయసు వచ్చిన ఇంకా వివాహం చేసుకోకపోవడంతో అభిమానులు పెళ్లెప్పుడు చేసుకుంటారు అంటూ పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ ముద్దుగుమ్మ ఎప్పుడు పెళ్లి ప్రకటన చేస్తుందో చూడాలి.

# లారెన్ గాట్లీబ్ యొక్క ఫ్యాషన్ ఎంపికలు శైలి మరియు చక్కదనం మిక్స్



# భారీ షెడ్యూల్ కోసం ఫ్లైట్ ఎక్కుతోన్న స్టార్లు!




స్టార్ హీరోల చిత్రాల షూటింగ్ అంటే విదేశీల్లో తప్పనిసరి. స్టోరీ డిమాండ్ మేరకు ఖండాలు తప్పక దాటాల్సిందే. అందులోనూ పాన్ ఇండియా సినిమాలంటే ఎంత మాత్రం రాజీపడటానికి ఆస్కారం ఉండదు. ఒకవేళ రాజీ పడి సెట్స్ వేసినా? వాస్తవ లొకేషన్లలో చూసిన ఫీల్ రాదు. ఖర్చు కూడా ఎక్కడా తగ్గదు. సెట్ల కోసం కోట్లు ఖర్చుచేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే వీలైనంత వరకూ ఫారిన్ షెడ్యూల్స్ తప్పక ఉంటాయి. ప్రస్తుతం ఐకాన్ స్టార్ అలు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో పాన్ ఇండి యాలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే.

**50 రోజులు మండే ఎండల్లోనే:**

ఈ సినిమా షూటింగ్ మొదలైన నాటి నుంచి స్వదేశంలోనే చిత్రీకరణ జరుగుతోంది. ముంబై వేదికగానే షూటింగ్ జరుగుతోంది. ముంబైలోనే కొన్ని సెట్లు వేసి చిత్రీకరిస్తున్నారు. అవసరం మేర స్థానికంగా వివిధ లొకేషన్లలో షూటింగ్ చేస్తున్నారు. త్వరలోనే ముంబై షూట్ ముగియనుందని తెలుస్తోంది. తదుపరి కొత్త షెడ్యూల్ అబుదాబిలో ప్లాన్ చేస్తున్నారు. ఇది భారీ షెడ్యూల్. దాదాపు 50 రోజుల పాటు షూటింగ్ అక్కడే ఉంటుందని సమాచారం. ఈ షెడ్యూల్ లో దీపికా పదుకొణే కూడా పాల్గొంటుంది.


**10 దేశాల్లో డ్రాగన్ :**

బన్నీ-దీపిక మధ్య కాంబినేషన్ సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. బన్నీపై కొన్ని పోరాట సన్నివేశాలు కూడా చిత్రీకరించనున్నారుట. అలాగే యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శక త్వంలో  డ్రాగన్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మొదలైన నాటి నుంచి ఇండి యాలోనే షూట్ జరుగుతోంది. ప్రస్తుతం కర్ణాటకలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ అనంతరం ఫారిన్ షెడ్యూల్ మొదలవుతుందని సమాచారం. %-%డ్రాగన్%-% చిత్రీకరణ మొత్తం 10 దేశాల్లో ప్లాన్ చేసారు.

**క్లారిటీ వచ్చేది అప్పుడే:**

వాటిలో వివిధ ఎగ్జోటిక్ లోకేషన్లలోనే చిత్రీకరణ జరుగుతోంది. స్టోరీ డిమాండ్ మేరకు ప్రశాంత్ నీల్ ఎక్కడా రాజీ పడటం లేదు. సాధారణంగా నీల్ సినిమాలంటే విదేశీ షూటింగ్ ల కంటే సెట్స్ వేసి పూర్తిచేయడం అలవాటు. కానీ %-%డ్రాగన్%-% స్టోరీ విదేశీ లొకేషన్లను డిమాండ్ చేయడంతో? దేశాలు దాటుతున్నారు. విదేశీ షెడ్యూల్స్ లో భాగంగా నీల్ అక్కడ టీమ్ తో పని చేయనున్నారుట. ఎక్కువ రోజులు షూటింగ్ డేస్ ఉండటంతో స్థానికంగానే అవసరమైన స్టాఫ్ ని రిక్రూట్ చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నారుట. మరి ఈ ప్రచారంలో నిజమెంతో ఆయ నిర్మాణ సంస్థలు ఓపెన్ అయితే గానీ క్లారిటీ రాదు.

# కొత్తగా ఉన్నా ఆస్వాదిస్తున్నా



"చిత్రపరిశ్రమలో నేను ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. కానీ దాని కోసం వరుసగా సినిమాల్ని ఎంచు కుంటూ తొందరపడాల నుకోవట్లేద"ని అంటోంది అందాల తార కీర్తి సురేశ్. గ్లామర్ పాత్రలతో పాటు.. నాయికా ప్రాధాన్య చిత్రాలతో దక్షిణాదిలో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈ భామ.. గతేడాది 'బేబీ జాన్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ మ్యాగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో హిందీలో నటించడం గురించి మాట్లాడింది. "ఇది నా కెరీర్‌లో మరో ఉత్తేజకరమైన అధ్యాయం. నన్ను సవాలు చేసే పాత్రలు, కథల కోసం బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టాను. ఇక్కడ పనిచేసే విధానం, వారి సంస్కృతి ఇవన్నీ కొత్తగా ఉన్నాయి. వాటన్నింటి గురించి తెలుసుకుంటూ.. కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఈ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నా" అని అంది. నటనను వృత్తిగా ఎంచుకోవడం గురించి చెప్తూ..

"చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టే ముందు మా నాన్న గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేయాలని పట్టుబట్టారు. నేను కూడా దానికి అంగీకరించాను కానీ.. నటనపై ఉన్న ఆసక్తితో చదువులో ఫ్యాషన్ డిజైనర్ కోర్సును ఎంచుకున్నా" అని చెప్పుకొచ్చింది కీర్తి. ప్రస్తుతం ఈమె ఖాతాలో 'రివాల్వర్ రీటా', 'కన్నెవెడి' తదితర చిత్రాలున్నాయి.